క్లుప్తంగా

బెటాలియన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



బెటాలియన్ ముఖ ద్వారాన్ని ప్రారంభిస్తున్న కమాండెంట్ చటర్జీ

సత్తుపల్లిరూరల్: గంగారం 15వ పోలీస్ బెటాలియన్‌లో నూతనంగా నిర్మించిన బెటాలియన్ మెయిన్‌గేట్, గార్డురూం, రిసెప్షన్ రూంలను కమాండెంట్ పీజీపీసీ చటర్జీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెటాలియన్‌లోని అధికారులు, సిబ్బంది సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీధర్‌రాజా, రంగారెడ్డి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై 'షీ టీమ్' అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ సభ్యులు

వైరా: వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం షీటీమ్ సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో షీటీమ్, పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి మహిళా చట్టాలు, భద్రత గురించి అవగాహన కల్పించారు. మహిళలను ఎవరైనా వేదిస్తే 8712659222 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

వరిపైరును పరిశీలించిన అధికారులు



వరిపైరును పరిశీలిస్తున్న ఏఓ

కల్లూరురూరల్: మండలంలోని ఎర్రబోయినపల్లిలో రబి రవి పైరును మండల వ్యవసాయ శాఖ అధికారిని ఎం.రూప బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం వేసిన వరి పైరులో ఆకు చుట్ట పురుగు, మొవ్వ పురుగు, జింక్ లోపాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. జింకు లోపం ఉన్న వరిపైరులో జింకు సల్ఫేట్ ఎకరానికి 500 గ్రాములు పిచికారీ చేయాలని ఏఓ రైతులకు సూచించారు. ఆకు చుట్టు పురుగు నివారణకు గాను ఎకరానికి 300 గ్రాముల మోనోకోటోఫాస్ లేదా కార్ట్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ నీటికి ఒక ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ పవన్‌కల్యాన్, రైతులు శ్రీనివాసరావు, శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



భోజనం చేస్తున్న మండల ప్రత్యేకాధికారి సాయినాథ్, అధికారులు

ఏన్కూరు: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని మండల ప్రత్యేకాధికారి, మైనింగ్ ఏడీ సాయినాథ్ ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి.. వివరాలు సేకరించారు. బాలికలతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భోజనం నాణ్యతగా అందిచాలని, వంటపాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని, తాజా కూరగాయలతో వంటలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సకినాల రమేష్, హెచ్‌ఎం సైదయ్య పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

సత్తుపల్లిటౌన్: ఈ నెల 28, 29, 30వ తేదీల్లో నల్గొండలో జరగనున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా బాధ్యులు ఎస్‌కె రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. బుధవారం సత్తుపల్లిలోని నందూరి సీతారావమ్మ స్మారక టీఎస్ యూటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు నాగమల్లేశ్వరరావు, రామారావు, ఉమామహేశ్వరరెడ్డి, చెరుకు శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు, షమీ, భాను, నాగమణి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రాత్రి ప్రయాణాలు మానుకుంటే మేలు





వరప్రసాద్, ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ, ఖమ్మం

ఖమ్మంక్రైం: విపరీతమైన చలికి తోడు మంచు కురుస్తుండడం .. చలితో చేతులకు పట్టు లభించే అవకాశం ఉండనందున రాత్రి సమయాన ప్రయాణాలతో ప్రమాదాలు ఎదురయ్యే అవకాశముంది. రాత్రివేళ సాధ్యమైనంత మేర దూరం వెళ్తే ఉదయం ఇతర పనులు చేసుకోవచ్చని భావిస్తుంటారు. కానీ ప్రస్తుత సమయాన రాత్రి ప్రయాణాలు మానుకుంటేనే మేలని ఖమ్మం ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ వరప్రసాద్ సూచించారు. ఈ మేరకు వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వెల్లడించిన వివరాలు... త్వరలో క్రిస్మస్ సెలవులు, నూతన సంవత్సరం వేడుకలకు పలువురు విహార యాత్రలకు వెళ్లే అవకాశముంది. మధ్య తరగతి ప్రజలు కూడా సొంత కార్లు ఉపయోగిస్తుంటారు. ఇప్పుడు చలి ప్రభావం ఉన్నందున పగటి వేళ ప్రయాణాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. తప్పనిసరి రాత్రిపూట వెళ్లాల్సి వస్తే కారుకు ఫాగ్ ల్యాంప్‌లు వేసుకోవాలి. అలాగే ఎమర్జెన్సీ లైట్లు కూడా వాడాలి. వేగంగా కాకుండా 40 నుంచి 50 కి.మీ.కు మించి వేగంతో వెళ్లొద్దు. తెల్లవారుజామున మంచు ప్రభావం ఎక్కువగా ఉంటున్నందున కారు వైపర్లు పనిచేస్తున్నాయో, లేదో పరీక్షించుకోవాలి. అలాగే, కారులో హీటర్ పనితీరును గమనించాలి. ఇక ద్విచక్రవాహనదారులు సైతం రాత్రివేళ ప్రయాణించాల్సి వస్తే ఎమర్జెన్సీ లైట్లు తప్పక వాడాలి. చేతులకు గ్లౌస్ వేసుకుంటే పట్టు ఉంటుంది.

చలివేళ.. గ్యాడ్జెట్ల వాడకంలో అప్రమత్తత





జి.కోటి, ఖమ్మం

ఖమ్మం మయూరిసెంటర్: ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయిలో నమోదవుతున్నప్పుడు కంప్యూటర్లు, సెల్‌ఫోన్లలోని విడిభాగాలు ప్రభావితం అవుతాయి. ఈ మేరకు వీటిని ఉపయోగించే వారు చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఖమ్మంకు చెందిన హార్డ్‌వేర్ నిపుణుడు జి.కోటి వివరించారు. మంచు కురిసే సమయాన బయటి ప్రదేశాల్లో ల్యాప్‌టాప్, మొబైల్స్ వాడితే తెలియకుండానే మంచు లోపలికి వెళ్లే ప్రమాదముంటుంది. ఈ కారణంగా తడితో విడిభాగాలు కాస్త దెబ్బతింటాయి. అందువల్ల మంచు కురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగం తగ్గించడం మంచిది. తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైనప్పుడు కంప్యూటర్లు, ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువుల విడిభాగాలపై కొంత ప్రభావం ఉంటుంది. ఇదే సమయాన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌పై మాత్రం ఎలాంటి ప్రభావం చూపదు. ఇక కలర్ ప్రింటర్లను ప్రతిరోజు తప్పక వినియోగించాలి. ఇందులో భాగంగా రోజుకొక ప్రిం ట్ అయినా తీయాలి. తక్కువ ఉష్ణోగ్రతలు నమో దయ్యే సమయంలో వీటిని వినియోగించకుంటే పని చేయడం ఆగిపోతాయి.

రోడ్డు బాగు చేయండి మహాప్రభో..



భారీ వాహనాల రాకపోకలతో లేస్తున్న దుమ్ము

ముదిగొండ: ముదిగొండ–చిరుమర్రి బీటీ రహదారిపై మరమ్మతులు చేసేందుకు ఆరు నెలల క్రితం రోడ్డును తవ్వి కంకర పరిచి వదిలేశారు. ఇది దాదాపు కొంత కాలం నుంచి కంకరలో పలు వాహనాలు నడపలేక సాహసం చేస్తున్నారు. రహదారిపై వెళ్లే భారీ వాహనాల వల్ల పక్కనే ఉన్న వాహనదారులపై కంకర రాళ్లు ఎగిసి పడుతున్నాయి. కనీసం దుమ్ము దూళి లేచి రహదారి కనిపించకుండా ఉంటున్నా కూడా నీళ్లు చల్లించడంలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిరుమర్రి వద్ద బ్రిడ్జీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో రోడ్డు సరిగా లేక అదుపుతప్పి వాహనాలు పల్టీ కొడుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ముదిగొండ ప్రజల కోరుతున్నారు.

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు



రహదారులపై టిప్పర్లు అతి వేగంగా వెళ్లకుండా చర్యలు తీసుకోవడంతో పాటు రహదారిపై దుమ్ము, దూళి లేకుండా నీరు చల్లించాలని న్యూలక్ష్మీపురం గ్రామస్తులు కోరారు. తమ గ్రామంలోని రహదారిపై వెళ్తున్న టిప్పర్లను గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. అధికారులు రహదారిపై ట్యాంకర్ల ద్వారా నీరు చల్లించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

పోడు భూముల్లో బిందు సేద్యం



సాలెబంజరలో డ్రిప్ ద్వారా నీటి తడులు వేస్తున్న రైతు

కొణిజర్ల: మండలంలోని సాలెబంజర గ్రామంలో పోడు రైతులు బిందు సేద్యం చేస్తున్నారు. సాలెబంజర, మేకాలకుంట, క్రాంతినగర్, రామనరసయ్యనగర్ తదితర గ్రామాల్లో గిరిజనులు, గిరిజనేతరులు పోడు భూములు సాగు చేసుకుంటున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పోడుసాగు చేసుకుంటున్న గిరిజనులకు పోడు సాగు పట్టాలు ఇచ్చినప్పటికీ ఇటీవల కాలం వరకు అటవీ అధికారులు రైతులను పొలాలు దున్నుకోనివ్వలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అటవీ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి పోడు భూముల్లో బోర్లు వేసుకునేందుకు అనుమతి ఇప్పించడంతో.. రైతులు వందలాది బోర్లు వేయించుకుని కరెంట్ సౌకర్యం కూడా రావడంతో మోటర్లు బిగించుకున్నారు. మొక్కజొన్న సాగు చేసి డ్రిప్ ద్వారా నీరు వృథా కాకుండా మొక్కజొన్నకు తడులు వేస్తున్నారు. తమకు కరెంట్ సౌకర్యం రావడంతో పంటలకు నీరు పుష్కలంగా లభిస్తుందని పంటలకు ఢోకా లేదని గిరిజన రైతులు చెబుతున్నారు.

యాసంగి పంటలకు సాగర్ నీరు



యాసంగి పంటలకు సరఫరా చేస్తున్న సాగునీరు

కల్లూరురూరల్: నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలో యాసంగి పంటకు వారబంధి పద్ధతిలో సాగునీరు విడుదల చేయనున్నారు. ఈ మేరకు సాగర్ ఆయకట్టు పరిధిలో ఆరుతడి పంటలు వేసుకోవాలని జలవనరుల శాఖ అధికారులు రైతులను కోరారు. 2024 డిసెంబర్ నుంచి 2025 ఏప్రిల్ 25వ తేదీ వరకు సాగర్ నీరు విడుదల చేసేందుకు జల వనరుల శాఖ షెడ్యూల్ ప్రకటించింది. 150 రోజుల కాలంలో 117 రోజులు సాగు నీరు సరఫరా చేయనున్నారు. నీటి సరఫరాకు సంబంధించి ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిలో నెలలో 18 రోజుల పాటు నీటి సరఫరా ఉంటుంది. 12 రోజుల పాటు నీటి సరఫరా నిలిపివేస్తారు. మొత్తం మీద 13 సార్లు నీటి సరఫరా చేయనున్నారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని జలవనరుల శాఖ అధికారులు రైతులను కోరారు.

ఇళ్ల స్థలాలు చూపించాలి

ముదిగొండ: గతంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, పట్టాలు మంజూరు చేసిన వారికి ఇళ్ల స్థలాలు చూపించాలని వల్లాపురం గ్రామస్తులు తహసీల్దార్ సునీత ఎల్జిబెత్‌ను బుధవారం కలిసి తమ సమస్యను విన్నవించారు. ఇళ్ల స్థలాలను పరిశీలిస్తామని తహసీల్దార్ తెలిపారు.

కమల్‌రాజ్ పర్యటన

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడులో బుధవారం జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ పర్యటన నిర్వహించారు. స్థానిక కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం మరింతగా కృషి చేయాలని సూచనలు చేశారు. అనంతరం పలు శుభకార్యాలయాలకు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు రామకృష్ణ, నాగేశ్వరరావు, పార్టీ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాంబశివరావు, శ్రీనివాసరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

పెనుబల్లి: మండలంలోని చింతగూడెం ఎంపీపీఎస్, ఎంపీపీఎస్ (హెచ్‌డబ్ల్యూ)పాఠశాలల ఉపాధ్యాయులు రూ.15వేలు విలువగల నోట్‌పుస్తకాలను అందించారు. వీటిని బుధవారం పాఠశాల విద్యార్థులకు ఎంఈఓ ఎస్.సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మోహన్‌రావు, శ్రీనివాసరావు, నాగేంద్రరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి



మాలధారులకు ఇరుముడి కడుతున్న గురుస్వాములు

కారేపల్లి: కారేపల్లిలో అయ్యప్ప స్వామి మాలధారుల ఇరుముడి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. గంగమ్మతల్లి ఆలయ ప్రాంగణంలోని సింగరేణి కమ్యూనిటీ హాల్ అయ్యప్ప పీఠంలో అయ్యప్ప స్వామికి పంచామృతాల అభిషేకం అనంతరం గురుస్వామి పాలిక సారయ్య, నాగసాయిశర్మ, సంగు సాయి, తేజావత్ శంకర్ ఆధ్వర్యాన మాలధారులకు ఇరముడి కట్టారు. అనంతరం మాలధారులు గ్రామంలో ఊరేగింపుగా శబరిమలై బయలుదేరి వెళ్లారు.

బస్ సౌకర్యం కల్పించాలి

కొణిజర్ల: మండలంలోని మల్లుపల్లి, రామనరసయ్యనగర్ గ్రామాలకు ఆర్టీసీ బస్ సౌకర్యం లేక రెండు గ్రామాలకు చెందిన బాలికలు, స్కూళ్లు కాలేజీలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి భూక్యాప్రభుదేవా, సహాయ కార్యదర్శి సీహెచ్ అజయ్‌లు డిమాండ్ చేశారు. మల్లుపల్లి రామనరసయ్యనగర్‌లకు ఆర్టీసీ బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని కోరుతూ.. బుధవారం కొణిజర్లలో విద్యార్థులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో బస్సు సౌకర్యం ఉండటం వల్ల అనేక మంది బాలికలు ఉన్నత విద్య కోసం కొణిజర్ల, ఖమ్మం ప్రాంతాలకు వచ్చారని ప్రస్తుతం బస్సు సౌకర్యాన్ని రద్దు చేసి అధికారులు వారి జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. తక్షణమే బస్సు సౌకర్యం పునురుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు యం సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని బొప్పారం, నాగులవంచ సమీపంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఈనెల 4న గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరుతో పాటు ఇతర సామాన్లను అపహరించారు. ఈమేరకు బుధవారం విద్యుత్ సంస్థ ఏఈ ఉమామహేశ్వరి ఫిర్యాదు చేయగా.. ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిప్లొమా ఫలితాల్లో మిస్ట్ విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్: గత నవంబర్ నెలలో నిర్వహించిన పాలిటెక్నిక్ 3, 5వ సెమిస్టర్ ఫలితాల్లో సత్తుపల్లి మిస్ట్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ బుధవారం తెలిపారు. 3వ సెమిస్టర్‌లో డి.రామ్‌విద్య, యశ్విని, సాయిరామ, ఉదయ్‌గణేష్, జీవన్‌కుమార్, 5వ సెమిస్టర్ ఫలితాల్లో ఎ.పవన్‌కుమార్, పి.గణేష్, జె.స్పందన, ఆర్.చందన ప్రతిభ చూపినట్లు తెలిపారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, చైర్మన్ సత్యనారాయణ, డీన్ జాకీర్ హుస్సేన్, విభాగాధిపతులు అభినందించారు.

ఘనంగా ధనుర్మాస తిరుప్పావై ప్రవచనాలు



ప్రవచనాలు వినిపిస్తున్న దృశ్యం

మధిర: మధిర పట్టణంలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ధనుర్మాస ప్రవచనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నందూరి విజయశ్రీ చే తిరుప్పావై ప్రవచన కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం ప్రమీల ఆధ్వర్యంలో ప్రవచనకర్తను పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కల్లూరు: ఆటోఅండ్‌ట్రాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో జరిగే మహాసభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కే లాల్‌మియా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం కల్లూరు పట్టణంలో మహాసభకు సంబంధించి గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా నాయకుడు ఖమ్మంపాటి పుల్లారావు, నాయకులు శ్రీను, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, కిషోర్, చెన్నారావు, హుస్సేన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో బుధవారం వైరా న్యూలిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్త శాతం తక్కువ ఉన్న బాల బాలికలకు ఐరన్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు రక్తం ప్రాముఖ్యత గురించి వివరించారు. క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, ఉండ్రు వరలక్ష్మి, గంగవరపు కిషన్ రాయ్ ఉయ్యూరి రామకృష్ణ, జాలా మహాలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దగోపతి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో..

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం బాలికలకు ఎనీమియా, సికిల్‌సెల్ రక్త పరీక్షలు నిర్వహించారు. పెద్దగోపతి పీహెచ్‌సీ వైద్యాధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది బాలికల రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి, వైస్ ప్రిన్సిపాల్ నవ్య, వివిధ విభాగాల కోఆర్డినేటర్లు కేపీ ఐశ్వర్య, కె.రజిని, స్టాఫ్ నర్స్ సృజన, గౌతమి పాల్గొన్నారు.

మధిర హైకేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో..



రక్త పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

మధిర: మాటూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం మధిర హైకేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించి పిల్లల నుంచి బ్లడ్ శాంపిల్ సేకరించి హిమోగ్లోబిన్ పర్సంటేజ్, బ్లడ్ గ్రూప్ వివరాలను అందించారు. ఈ కార్యక్రమంలో హై కేర్ ఆస్పత్రి అధినేత జంగా ప్రవీణ్ రెడ్డి, హెచ్‌ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు కృష్ణమాచార్యులు, శ్రీనివాసరావు, సునీత, ఇబ్రహీం, శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడల్లో విద్యార్థుల సత్తా..

రైఫిల్ షూటింగ్‌లో పతకాలు..



బాలికలను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

వైరా: ఖమ్మంలో బుధవారం జరిగిన సబ్ జూనియర్ రైఫిల్ షూటింగ్ సీఎం కప్ పోటీల్లో వైరాలోని జెడ్పీ ఉన్నత పాఠశాల గన్నవరం బాలికలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం చావా శ్రీనివాసరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శీలం కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 27నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు బాలికలు అర్హత సాధించారు.

లూర్థుమాత పాఠశాల విద్యార్థుల..

తల్లాడ: ఖమ్మంలో జరిగిన సీఎం కప్ క్రీడల్లో మండలంలోని నారాయణపురం లూర్థుమాత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ విభాగంలో 800 మీటర్ల పరుగు పెందెంలో కె.సంవిధ ద్వితీయ బహుమతిని గెల్చుకోగా, 400 మీటర్ల పరుగు పందెంలో పి.సాయి ప్రవంతి తృతీయ బహుమతిని సాధించింది. దీంతో విద్యార్థులను హెచ్‌ఎం ప్రసన్న, కరస్పాండెంట్ రోజలీన్ జోసఫ్, పీఈటీ చలపతిరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

మధిర: క్రీడలు శారీరక ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు, ఎంఈఓ వై.ప్రభాకర్ తెలిపారు. సీఎం కప్ పోటీల్లో కబడ్డీ బాలికల విభాగంలో మధిర మున్సిపాలిటీ జట్టు జిల్లా స్థాయి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మధిర మున్సిపాలిటీ కబడ్డీ బాలికల టీం కెప్టెన్ బానోత్ శిరీష, క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులు బొందిలి చైతన్య, మాధవరావును ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల కోసం బానోత్ శిరీష, భూక్య శ్రావణి, కనకపుడి కావేరి ఎంపిక కావడం హర్షణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం నండూరి విజయశ్రీ , నరసింహారావు, చిన్ని, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

యువత రాజకీయాల్లో రాణించాలి



మాట్లాడుతున్న రామనాథం

బోనకల్: యువత రాజకీయాల్లో రాణించడం ద్వారానే రాబోయే తరానికి బలమైన నాయకత్వం అందించవచ్చని టీడీపీ ఖమ్మం జిల్లా పార్లమెంటరీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం అన్నారు. మండల కేంద్రంలోని సాయిబాబా కల్యాణ మండపంలో ఖమ్మం పార్లమెంటరీ స్థాయి జిల్లా తెలుగు యువత సమావేశం బుధవారం జరిగింది. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి కార్యకర్తలే బలమని, రాష్ట్రంలో పార్టీ పునర్నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో తెలుగు యువత నాయకులు పొగాకు జయరాం, భాగం రాకేష్, యలమంచలి శివ, రావుట్ల సత్యనారాయణ, తాజుద్దీన్, తుళ్ళూరి కొండల్‌రావు, పాపినేని వెంకటయ్య, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు పంపిణీ



సర్వీస్ రిజిస్టర్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ మురళీమోహన్‌రెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని పలు పాఠశాలల్లో ఇటీవల విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు పంపిణీ చేశారు. బుధవారం మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో పీఆర్టీయూ మండల కమిటీ వితరణ చేసిన సేవా గ్రంథాలను (ఎస్ఆర్) ఎంఈఓ మురళీమోహన్‌రావు అందించారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొగ్గల మదన్‌మోహన్‌రెడ్డి, మారపాక బాబురావు, సంఘం నాయకులు తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలి

ఏన్కూరు: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ.. యూటీఎఫ్ అధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాంచంద్, పుల్లయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీదేవి, నర్సింహారావు, రాఘవరావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.